క్లుప్తంగా

పాలిసెట్ ర్యాంకర్లకు అభినందన

మాడుగుల రూరల్: సృజనవాణి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వి.వి.అగ్రహారంలో ఏటా మాదిరిగానే పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా నెల రోజులపాటు శిక్షణ పొందిన 70 మందిలో 9 మంది విద్యార్థు లు మంచి ర్యాంకులు సాధించారని సంస్థ సమన్వయకర్త ఆర్. రామారావు గురువారం తెలిపారు. కె.జె.పురానికి చెందిన డి.చైతన్య – 1,031, ఎ.ఉషశ్రీ 1,711, జి.అగ్రహారానికి చెందిన ఎ. నాగలక్ష్మి 1,773 ర్యాంకు సాధించారు. వీరిని సంస్థ సమన్వయకర్తలు రామారావు, జానీ అభినందించారు.

ఘనంగా పైడితల్లమ్మ పండగ



పైడితల్లమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: స్థానిక వేలంబంద సమీపంలో పైడితల్లమ్మ పండగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త పెంటకోట పోతురాజు కుమారులు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పోస్టల్ బ్యాలెట్ వేసిన 2,542 మంది ఉద్యోగులు

చోడవరం: ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. నియోజకవర్గంలో 2,542 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 2,630 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోగా 2,542 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొదటి రోజున ఇక్కడ హెల్ప్‌డెస్క్ వల్ల కొంత ఇబ్బంది పడినప్పటికీ అధికారులు సరిచేయడంతో తర్వాత అంతా సక్రమంగా ఓటును వినియోగించుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నికృష్ణ చెప్పారు.

మాడుగులలో 2,261 మంది ఉద్యోగులు..

మాడుగుల: స్థానిక ఆర్‌సీఎం పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ గురువారంతో ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి సత్యవాణి తెలిపారు. గురువారం 56 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ వేయగా, మొత్తం 2,261 మంది ఉద్యోగులు వినియోగించుకున్నారని చెప్పారు.

చోడవరంలో పోలీస్ ఫ్లాగ్ మార్చ్



పట్టణ వీధుల్లో కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ, పోలీసులు

చోడవరం రూరల్: సాధారణ ఎన్నికల పోలింగ్‌కు మరో నాలుగు రోజులే ఉండడంతో శాంతి భద్రత పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన నింపడానికి గురువారం అనకాపల్లి డీఎస్పీ ఎల్.మోహనరావు సారథ్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. పట్టణంలోని ఐటీఐ కాలనీ, ఎడ్లవీధి, చిన్నబజారు, అన్నవరం, పెదబజార్, కొత్తూరు మీదుగా అనకాపల్లి–చోడవరం మెయిన్‌రోడ్డులో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లు తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని, ఎటువంటి బెదిరింపులు, ప్రలోభాలకు భయపడవద్దని ఈ సందర్భంగా ప్రజానీకానికి తెలియపరిచారు. కవాతులో చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు, ఎస్ఐ శేఖరం, ఐటీబీపీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి విస్తృత ప్రచారం

చోడవరం రూరల్: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగతా శ్రీనివాసరావు చోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో అలుపెరగకుండా విస్తృత ప్రచారాన్ని చేస్తున్నారు. ఆయా మండలాల వారీగా పలు గ్రామాల్లో రోజు వారీ ప్రచారాన్ని చేస్తున్నారు. పలు కూడళ్లలో చిరు వ్యాపారులను కలిసి తాను గెలిచినా, ఓడినా చోడవరంలోనే నివాసం ఉంటానంటూ నమ్మబలుకుతున్నారు. సాయంత్రం వేళల్లో గ్రామాలకు చేరుకుని ఓటర్లను కలసి కాంగ్రెస్ మేనిఫెస్టోను వివరిస్తున్నారు. గురువారం ఆయన అడ్డసారం, దిబ్బలపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట ఇండియా కూటమి పక్షాలైన సీపీఎం, సీపీఐ నాయకులు ఉన్నారు.

భారీ వర్షాన్ని లెక్కచేయని అభిమానం

- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ ప్రచారానికి జననీరాజనం
- ప్రసంగానికి కేరింతలు కొట్టిన జనం
- జగనన్న సీఎం అయితేనే పథకాల అమలు



అంతకు ముందు కొత్తకోటలో వైఎస్సార్‌సీపీలో శ్రేణుల భారీ ర్యాలీ



జోరు వర్షంలోనూ ప్రసంగిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, పక్కన ధర్మశ్రీ

రావికమతం: భారీ వర్షంలోనూ వైఎస్సార్‌సీపీ అభిమానం వెల్లువెత్తింది. కొత్తకోటలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారానికి జన నీరాజనం పలికారు. ఈ ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ ప్రసంగానికి ఈలలు వేస్తూ కేరింతలు కొడుతూ సందడి చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులనుద్దేశించి వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితేనే ఇప్పుడున్న సంక్షేమ పథకాలన్నీ యథావిధిగా అమలవుతాయన్నారు. లేకుంటే అన్ని వర్గాల ప్రజలకు, పేదలకు అన్యాయమే జరగనుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అన్నారు. ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధితో అన్ని వర్గాల కోసం ఐదేళ్లలో అహర్నిశలు శ్రమించారన్నారు. మేనిఫెస్టోను 99 శాతం అమలు చేసి, తన వలన మంచి జరిగితేనే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడని ప్రశంసించారు. దేశంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయన్ను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఇప్పుడు ప్రకటించిన మేనిఫెస్టో విశేష జనాదరణ పొందిందన్నారు. చేసేదే చెప్తారని, చెప్పినది చెప్పినట్టుగా అమలు చేస్తారని ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ధర్మశ్రీకి, ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. తొలుత ప్రసంగం సమయానికి భారీ వర్షం కురడవడంతో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు లెక్కచేయకుండా కేరింతలు కొట్టడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. త్వరలోనే మన ప్రభుత్వం ఏర్పాటయ్యాక విజయోత్సవం చేసుకుందామని మరలా వస్తానని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి పేరు చెబితేనే వర్షాలు పలకరిస్తాయని, గడిచిన అయిదేళ్లు ఒక మంచి ఉదహరణగా చెప్పవచ్చని ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ అన్నారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ శ్రేణులు గ్రామంలో డప్పుల వాయిద్యాలు, బాణసంచాతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

మాట తప్పని నేత సీఎం జగన్

- ధర్మశ్రీ కుమార్తె స్వాతి ప్రచారానికి విశేష స్పందన



జె.నాయుడుపాలెంలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ బగుడు వెంకటరమణ



కొమరువోలులో ప్రచారం చేస్తున్న పార్టీ మండలాధ్యక్షుడు గొర్లె రామన్, ధర్మశ్రీ కుమార్తె స్వాతి

రోలుగుంట: మాట తప్పని మడమ తిప్పని నేతగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఎనలేని ఆదరణ ఉందని, ఆ నమ్మకంతోనే సంక్షేమ పథకాలు 99 శాతం అమలు చేశారని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కుమార్తె స్వాతి అన్నారు. ఎమ్మెల్యేగా కరణం ధర్మశ్రీని, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొర్లె వెంకటరామన్, ధర్మశ్రీ కుమార్తె స్వాతి పలు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కొమరవోలులో ఇంటింటా తిరిగారు. సంక్షేమాల గురించి ప్రజలకు వివరించారు. వలంటీర్లు లేక పింఛన్ తీసుకోవడానికి ఎదుర్కొన్న కష్టాలు గురించి తెలుసుకున్నారు. దీనిపై వెంకటరామన్ స్పందిస్తూ వలంటీర్ల సేవలు, సంక్షేమ పథకాలు నిలిచిపోవడానికి టీడీపీ, జనసేన పార్టీ అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ చేసిన కుట్రల వల్లేనని వివరించారు. ఈ నెల 13న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. తిరిగి వలంటీర్ల సేవల పునరుద్ధరణతో సంక్షేమ పథకాలు యథావిధిగా అందుతాయన్నారు. ఈ ప్రచార కార్యక్రమాలు జె.నాయడుపాలెంలో సర్పంచ్ బగుడు వెంకటరమణ, బీబీపట్నంలో గరగా సత్యవతి, అయితి రాజులనాయుడు, రేవళ్ల ఈశ్వర్రావు నిర్వహించారు.

15న గౌరీపరమేశ్వరుల కల్యాణం

అనకాపల్లి: స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని ఈనెల 15న ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అర్చకులు రేజేటి గోప అప్పలచార్యులు(చక్రవర్తి)పర్యవేక్షణలోగౌరీపరమేశ్వరుల కల్యా ణ మహోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు.

స్థానికేతర అభ్యర్థులను తరిమికొట్టండి

- వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి కిశోర్ కుమార్



మాడుగులలో నినాదాలు చేస్తున్న ఆడారి కిశోర్, పార్టీ నాయకులు

మాడుగుల రూరల్: స్థానికేతరులైన బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, టీడీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణ మూర్తిలకు ఓటుతో బుద్ధి చెప్పాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆడారి కిశోర్‌కుమార్ అన్నారు. గురువారం మాడుగులలో స్థానిక నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. గౌతు లచ్చన్న లాంటి స్వాతంత్ర్య సమరయోధుల పుట్టిన ఉత్తరాంధ్ర గడ్డపై స్థానికేతర అభ్యర్థి సీఎం రమేష్‌ను పోటీలోకి దించడం దారుణమన్నారు. స్థానికులను కాదని, దిగుమతి వ్యక్తులకు అనకాపల్లి ఎంపీ టికెట్ కేటాయించారన్నారు. ఇక్కడ పార్టీకి కష్టపడి పనిచేసిన స్థానిక టీడీపీ నాయకులు గవిరెడ్డి రామానాయుడు, పైలా ప్రసాదరావు, పీవీజీ కుమార్‌లను కాదని పెందుర్తి నుంచి బండారు సత్యనారాయణమూర్తిని దిగుమతి చేసుకుని ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో నిలపడం తగదన్నారు. స్థానికులకు కాదని స్థానికేతరులకు టికెట్లు ఇచ్చారని, అందువల్ల తాను టీడీపీకి రాజీనామా చేశానన్నారు. వార్డు సభ్యుని నుంచి డిప్యూటీ సీఎం స్థాయికి ఎదిగిన బూడి ముత్యాలనాయుడును అనకాపల్లి పార్లమెంటు అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం బరిలో ఉంచిందని, ఆయన కుమార్తె మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఈర్లె అనురాధను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగులు సంక్షేమానికి అన్ని విధాలుగా కృషి చేసారని, ప్రధానంగా 50 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ఏ, ఇతర అలవెన్సు లు, జీత భత్యాలు అందించారన్నారు. రూ.2.43 లక్షల కోట్లతో నవరత్నాలు అమలు చేసి 99 శాతం హామీలు నెరవేరిస్తే రాష్ట్రం శ్రీలంక అయిపోయిందని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు విమర్శించారన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలకు రూ.4.50 లక్షల కోట్లు అవసరమవుతాయని, ఈ నిధులు ఎక్కడ నుంచి తీసుకొస్తారని ప్రశ్నించారు. సీఎం రమేష్ ఓటమి భయంతో ఎంపీ అభ్యర్థి బూడి స్వగ్రామంలో ఘర్షణలకు పాల్పడ్డారన్నారు. గూండాయిజంతో గెలవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించా రు. ఈ సందర్భంగా సీఎం రమేష్ గోబ్యాక్, పెత్తందారులు వద్దు.. నాన్ లోకల్ వద్దు లోకల్ ముద్దు అని నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు వేమవరపు రామధర్మజ, పార్టీ నాయకులు పుట్టా మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ భీమరశెట్టి పైడిబాబు పాల్గొన్నారు.

జోరు వానలోనూ... వైఎస్సార్‌సీపీ ప్రచార హోరు

- తడుస్తూనే ప్రచారం చేసిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు
- జన సంద్రంగా మారిన దేవరాపల్లి ప్రధాన రోడ్డు
- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఆశీర్వదించండి
- అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు



వర్షంలో తడుస్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న బూడి ముత్యాలనాయుడు, అనురాధ



ముత్యాలమ్మపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: జోరువానలోనూ వైఎస్సార్‌సీపీ ప్రచార ర్యాలీ హోరెత్తింది. భారీ వర్షం కురుస్తున్నా పార్టీ శ్రేణులు, ప్రజలు, అభిమానులు తడుస్తూనే రెట్టింపు ఉత్సాహంతో జగనన్న పాటలకు డ్యాన్స్ వేస్తూ సందడి చేశారు. జైజగన్, జైబూడి, జై అనురాధ నినాదాలతో హోరెత్తించారు. వర్షంలో తుడుస్తూనే ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ముందుగా దేవరాపల్లిలో గురువారం సాయంత్రం మహిళల కోలాటం, తీన్‌మార్ వాయిద్యాల నడుమ పండుగ వాతావరణంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. మేమంతా మీ వెంటే అంటూ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా వేలాదిగా ప్రజలు, మహిళలు, పార్టీ శ్రేణులు తరలిరావడంతో దేవరాపల్లి జనసంద్రాన్ని తలపించింది. ఉప్పెనలా ఎగిసిపడిన జన కెరటంతో ప్రధాన రహదారి జనంతో తడిసిముద్దయింది. రెల్లిపేట నుంచి ప్రారంభమైన ప్రచార ర్యాలీ ప్రధాన రహదారిలో నాలుగు రోడ్ల కూడలి మీదుగా తెనుగుపూడి రహదారి వైపు వెళ్లి, అక్కడి నుండి ఎస్సీ కాలనీ, శ్రీకృష్ణుని ఆలయం పక్క నుంచి మరలా నాలుగు రోడ్ల కూడలి మీదుగా వరదపురెడ్డి లలితానాయుడు ఇంటికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి బూడి మాట్లాడుతూ దేవరాపల్లిలో సీఎం జగన్ సహకారంతో తాను చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించి అండగా నిలవాలని కోరారు. యాభై ఏళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలో చేసి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దానన్నారు. సంక్షేమ, అభివృద్ధిని చూసి ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా అనురాధను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. తద్వారా మరింత అభివృద్ధి చేసి మోడల్‌గా రూపుదిద్దుతానన్నారు. మరలా రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, వచ్చేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. స్థానికేతర అభ్యర్థులు ఎన్నికలయ్యాక కనిపించే పరిస్థితి ఉండదని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, వైస్ ఎంపీపీలు చింతల బుల్లిలక్ష్మి, ఉగ్రూకుల గంగాభవానీ, కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టరు వరదపురెడ్డి సింహాచలంనాయుడు, వరదపురెడ్డి లలితానాయుడు, గండిపడాల అప్పలరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ కేవీ రమణ, వేచలపు వాణి, మాజీ ఎంపీటీసీ సోమిరెడ్డి వరలక్ష్మి, చొక్కాకుల వెంకటరమణ, ఈరుగుబిల్లి అప్పలనాయుడు, గొర్లి తాతారావు, సోమిరెడ్డి పేరునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సుగర్ ఫ్యాక్టరీని నష్టాల్లోకి నెట్టిన టీడీపీ

- వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గాడిని పెట్టాం
- 10 గ్రామాల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం



కొత్త కొండెంపూడిలో ర్యాలీగా వెళ్తున్న విప్ ధర్మశ్రీ



మంగళాపురంలో జగనన్న సంక్షేమ పాలన గురించి వివరిస్తున్న విప్ ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో 23 వేల మంది కుటుంబాలు ఆధారపడ్డ గోవాడ సుగర్ ఫ్యాక్టరీని రూ.175 కోట్ల నష్టాల్లోకి నెట్టిన టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజును ఓడించాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కోరారు. ఆయన గురువారం కొమ్మళ్లపూడి, బుదిరెడ్లపాలెం, గొల్లకొంపలు, పాత కొండెంపూడి, కొత్త కొండెంపూడి, కేపీ అగ్రహారం, ఐయితంపూడి, విజయరామరాజుపేట, మంగళాపురం, కుముదాంపేట గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. అన్ని గ్రామాల్లో ప్రజలు, మహిళలు ఎదురెళ్లి హారతులు పట్టి పూలు జల్లి స్వాగతం పలికారు. 14 ఏళ్ల చంద్రబాబునాయుడు పాలనలో ప్రజలకు ఏదైనా సంక్షేమ పథకం అందిందా అని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రజలు ఆలోచించాలన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా భావించి అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, విద్యా, వసతి దీవెన, నాడు –నేడుతో పాఠశాలలు, ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు అభివృద్ధి చేసి మన బతుకులు బాగు చేస్తున్న జగనన్నకు పట్టం కట్టాలన్నారు. రైతు, డ్వాక్రా రుణమాఫీ చేస్తానని, ఇంటికొక ఉద్యోగం, నెలకు రెండు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి గద్దె నెక్కిన తర్వాత మోసం చేసిన చంద్రబాబునాయుడుకు ఈ ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ముత్యాలనాయుడులకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించి సీఎం జగనన్నకు కానుకగా అందించాలని కోరారు. కొమళ్లపూడికి చెందిన ఒక వ్యక్తి పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశానని, తాను చెప్పిన పార్టీకి ఓటు వేయకపోతే బాగుండదని బెదిరిస్తున్నాడని పలువురు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ దృష్టికి తీసుకురాగా, అలాంటి వాటికి ఎవరూ భయపడొద్దని, ఓటు ఎవరికి వేస్తున్నదో తెలియదని, మేలు చేస్తున్న పార్టీకి నిర్భయంగా ఓటు వేయాలని ధర్మశ్రీ సూచించారు. పై గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేశానని, మరలా రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని కోరారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ నాగేశ్వరిదేవి, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు మోటూరి చిన్నంనాయుడు, కె. అప్పలనాయుడు, జోగా కొండబాబు, నమ్మి అప్పలరాజు, గోపిశెట్టి శ్రీను, పెద్దాడ నాయుడు, విజయ్‌కుమార్, పద్మరేఖ వెంకట్, ప్రకాష్‌రావు, గుమ్మిడి శ్రీను పాల్గొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



పాడుగుపాలెంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు ఎలా వేయాలో చెబుతున్న శంకరరావు



కొత్త అగ్రహారంలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకుడు సూర్యనారాయణ



వి.వి.అగ్రహారంలో వీవీ ప్యాట్‌తో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు



పొంగలిపాకలో ప్రచారం చేస్తున్న పార్టీ శ్రేణులు



కె.జె.పురంలో ప్రచారంలో సర్పంచ్

కె.కోటపాడు: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలకు మద్దతుగా పార్టీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. గురువారం సూదివలసలో ఎంపీటీసీ వర్రి రామునాయుడు, పాడుగుపాలెంలో ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు, కొత్త అగ్రహారంలో పార్టీ నాయకుడు లెక్కల సూర్యనారాయణ ప్రజలను కలిశారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. వివక్ష లేకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు చేశారన్నారు. అన్ని రంగాల్లోను రాష్ట్రం అభివృద్ధి సాధించేలా సుపరిపాలన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13న ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లును ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు.

మాడుగుల రూరల్: ఈ నెల 13న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరుతూ గ్రామాల్లో పార్టీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. గురువారం వి.వి.అగ్రహారం, పొంగలిపాక, కె.జె.పురం, ఒమ్మలి, తాటిపర్తి, కింతలి, వంటర్లపాలెం, ముకుందపురం, పోతనపూడి, ఎం.కె. వల్లాపురం, ఎం. కోటపాడు, తదితర గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి నాయకులు ఉదయం, సాయంత్రం ప్రచారం చేశారు. వి.వి.ప్యాట్లు తీసుకెళ్లి ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఎంపీగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా ఈర్లె అనురాధలను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయా గ్రామాలు ప్రజా ప్రతినిధులు, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, మహిళలు పాల్గొన్నారు.

యర్రా అప్పారావు చేరికతో పార్టీకి నష్టం లేదు

- వైఎస్సార్‌సీపీ చీడికాడ నాయకులు



చీడికాడలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీడికాడ: పదవులు అనుభవించి, తన స్వార్థ ప్రయోజనాలు కోసం పార్టీని వీడిన యర్రా అప్పారావుతో వైఎస్సార్‌సీపీకి నష్టం లేదని అధికార పార్టీ నాయకులు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో చీడికాడ పాల సొసైటీ అధ్యక్షుడు పరువాడ అప్పారావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పరువాడ మహేష్, డెయిరీ డైరెక్టరు శీరంరెడ్డి సూర్యనారాయణ మాట్లాడుతూ 2013లో పార్టీలో చేరిన అప్పారావుకు 2014లో పార్టీ మండలాధ్యక్షునిగా నియమించగా, 2021 వరకు పదవిలో కొనసాగారని, అదే సంవత్సరం ఎంపీటీసీ ఎన్నికల్లో తురువోలు ఎంపీటీసీ టికెట్ ఇస్తే ఓటమి చెందారన్నారు. అక్కడ గెలిచి వుంటే ఎంపీపీ పదవి ఇవ్వడానికి అప్పట్లో పార్టీ అధిష్టానం ఈయన పేరు ప్రకటించిందన్నారు. పార్టీ పరంగా ఆదుకోనేందుకుగాను ఆయనకు రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్‌గా నియమించిందన్నారు. కొద్ది నెలల క్రితం అనారోగ్యానికి గురయితే మెరుగైన వైద్య చికిత్స కోసం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు స్వయంగా ఆస్పత్రిలో చేరిప్పించారన్నారు. ఈ విధంగా పార్టీలో అధిక ప్రాధాన్యమిస్తే, వాటిని మరచి టీడీపీలో చేరారని విమర్శించారు. 2021 పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ నాయకుల నుంచి నగదు తీసుకుని, వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థులను ఓడించారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో 500 ఓట్ల మెజార్టీ గ్రామంలో సాధించి తీరుతామన్నారు. పార్టీ నాయకులు పరువాడ రామారావు, పరువాడ వెంకట్రావు, బొబ్బిలి దేముడు, చిరికి దేముడునాయుడు, పరువాడ ప్రసాదు, బొడ్డకాయల కృష్ణ, చిరికి బలరామ్, అయ్యబాబు, బొడ్డు కనకయ్య పాల్గొన్నారు.

స్థిరంగా కూరగాయల ధరలు

కె.కోటపాడు: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు దాదాపు స్థిరంగా ఉన్నా యి. కిలో టమాటా రూ.20, ఉల్లి రూ.25, బంగాళాదుంప రూ.30, బెండ, వంగ, క్యాబేజీ రూ.40, కాకరకాయ, దొండ, క్యాబేజీ, బీట్రూ ట్ రూ.60 చొప్పున విక్రయించారు.

దేవరాపల్లిలో వెయ్యి బైక్‌లతో భారీ ప్రచార ర్యాలీ



భారీ బైక్ ర్యాలీలో పార్టీ శ్రేణులతో ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ఎన్నికల ప్రచారం హోరెత్తింది. జైజగన్, జైబూడి నినాదాలతో గురువారం దేవరాపల్లి పరిసర ప్రాంతాలు మార్మోగాయి. వీరి వెంట వెయ్యి బైక్‌లతో పార్టీ నాయకులు, కార్యకర్తలు జెండాలు చేతపట్టి కదం తొక్కారు. దీంతో ఎటు చూసినా వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. స్థానిక ప్రధాన రోడ్డు మీదుగా దేవరాపల్లిలోని అన్ని కల్లాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు.